క్లుప్తంగా

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

ప్రత్తిపాడు: అమ్మ పాలను అమృతంతో పోలుస్తారు. పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలను దివ్యౌషధంగా చెబుతారు. అత్యంత విశిష్టత కలిగిన తల్లిపాలకు కొందరు బిడ్డలు దూరమవుతున్నారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొందరు తల్లులు అపోహలకు పోయి బిడ్డలను డబ్బాపాలకు పరిమితం చేస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో పుట్టిన రెండు మూడు రోజుల వరకూ శిశువుకు పాలు తాగించని పరిస్థితులూ అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా శిశువులు రోగాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ఈనేపథ్యంలో తల్లిపాల విశిష్టతను, ఆవశ్యకతను ప్రజలకు వివరించేందుకు ప్రభుత్వం ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తుంది.

చేబ్రోలు తహసీల్దారుగా శ్రీనివాస శర్మ



చేబ్రోలు: చేబ్రోలు మండల తహసీల్దారుగా కె.శ్రీనివాస శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల్లో విధులు నిర్వహించిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు బదిలీ అయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల తహసీల్దారుగా కె.శ్రీనివాస శర్మ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మేడికొండూరు తహసీల్దారుగా పనిచేస్తూ ఎన్నికల విధులకు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస శర్మ మాట్లాడుతూ అందరి సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల పునఃప్రారంభం




పొన్నూరు: పట్టణంలోని ఎనిమిదో వార్డు క్యాబిన్ పేటలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నాయకులు పాల్గొన్నారు.

పుట్ట గుడి హుండీలో కానుకలు చోరీ



పెదకాకాని: హుండీ పగులగొట్టి కానుకలు చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి ఉప్పలపాడు శివారులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు శివారు ప్రాంతంలో వెంకటకృష్ణాపురం గ్రామానికి సమీపంలో పుట్ట గుడిలో భక్తులు నిత్యం పూజలు చేస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు కానుకలు వేసేందుకు హుండీ ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి కానుకల హుండీని గుర్తు తెలియని దొంగలు పగులగొట్టి కానుకలు ఎత్తుకెళ్లారు. బుధవారం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ పగులగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన హుండీని పరిశీలించారు. ఆలయ పర్యవేక్షకుడు చలపతి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది.

ఆవుల లోడుతో ఉన్న లారీ స్వాధీనం



గుంటూరు రూరల్ : అక్రమంగా ఆవులు, ఎద్దులను తరలిస్తున్న లారీని నల్లపాడు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌హెచ్–16 అంకిరెడ్డిపాలెం సమీపంలో ఆవులను అక్రమంగా లారీలో తరలిస్తున్నారని ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులంతా ఒక్కటై.. సమస్యకు పరిష్కారం

- సొంత డబ్బులతో పూడికతీత పనులకు శ్రీకారం
- నీటి పారుదలకు అడ్డంకిగా గుర్రపు డెక్క
- డ్రెయిన్ల వైపు కన్నెత్తి చూడని అధికారులు



కాలువల్లో వ్యర్థాలు, గుర్రపు డెక్క



పొక్లెయిన్‌తో గుర్రపు డెక్క తొలగిస్తున్న దృశ్యం

పొన్నూరు: చినుకుపడితే చాలు వ్యవసాయ భూములు ముంపుబారిన పడుతుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని వెల్లలూరు గ్రామ పరిధిలోని పంట పొలాల్లో మురుగు దిగువకు వెళ్లని పరిస్థితి ఎదురైంది. డ్రెయిన్ ప్రక్షాళన పనులు చేపట్టాలని కోరుతూ సాగుదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా స్పందన లేదు. దీంతో రైతులంతా కలిసి చందాలు వేసుకొని రోడ్డు వెంబడి కాలువలో పూడికతీత పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు.

– పొక్లెయిన్‌తో పూడిక, గుర్రపు డెక్క తొలగింపు

వర్షం కురిస్తే చాలు ఈ ప్రాంతంలో వరి చేలు ముంపు బారిన పడుతుండటంతో రైతులు విరామం ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గ్రామ శివారులో రోడ్డు వెంబడి సంబంధిత రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల వరకు వరి సాగు భూములున్నాయి. పొలాలకు ఆనుకొని ఉన్న సాగునీటి కాలువ, డ్రెయిన్‌లో వ్యర్థాలు, గుర్రపు డెక్క నిండి ఉండటంతో మురుగు పారుదలకు అవరోధాలు ఎదురవుతున్నాయి. రైతులకు అండగా ఉంటామన్న ప్రభుత్వం వారి సమస్యలు తీర్చేందుకు ముందుకు రాలేదు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. రైతులే ధైర్యం చేసి అందరూ తమ వంతు డబ్బులు గంటకు రూ.1,300 చొప్పున చెల్లించి పొక్లెయిన్ ద్వారా పూడికతీత పనులు పూర్తిచేశారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



వర్షాకాలం కావడంతో ముంపు సమస్య అధికంగా ఉంటుంది. వ్యవసాయ భూముల్లో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో సాగుకు ఇబ్బందికరంగా ఉంటుంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారు. కావున రైతులంతా కలిసి పూడికతీత పనులు చేయించుకుంటున్నాం.

వెంకట నరసయ్య, రైతు, వెల్లలూరు

రైతుల సమస్యలు పరిష్కరించాలి



కాల్వల్లో గుర్రపు డెక్క, వ్యర్థాలను తొలగించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. సాగు చేయాలంటే అవరోధాలు ఎదురవుతున్నాయి. వర్షం కురిస్తే పొలాల్లో నీరు నిల్వ చేరుతోంది. అందుకే రైతులంతా కలిసి చందాలేసుకొని పూడికతీత పనులు చేయిస్తున్నాం.

నరసింహమూర్తి, రైతు, వెల్లలూరు

బడిలో మోగిన ఎన్నికల గంట

- నేడు ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్
- 8వ తేదీన ఎన్నికలు



ప్రత్తిపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాల

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల గంట మోగింది. 2021 సెప్టెంబరులో గత ప్రభుత్వం పేరెంట్స్ కమిటీల పేరుతో రెండు సంవత్సరాల కాల పరిమితితో ఎన్నికలు నిర్వహించింది. 2023 సెప్టెంబరులో ఆయా కమిటీల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది.

– ఆగస్టు 1వ తేదీ ఉదయం 10 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పునర్వ్యవస్థీకరణ కోసం ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు నోటీసు బోర్డులో ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా ప్రదర్శిస్తారు.

– ఆగస్టు 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఫిర్యాదులు ఏమైనా అందితే వాటిని పరిష్కరిస్తారు. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓటరు జాబితాను ఖరారు చేసి, తుది జాబితాను ప్రదర్శిస్తారు.

– 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల పునర్వ్యవస్థీకరణకు ఎన్నికలు నిర్వహిస్తారు. 1.30 గంటలకు కమిటీ సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. 2 గంటలకు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. అనంతరం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు మొదటి పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహిస్తారు.

ప్రత్తిపాడు మండలంలో పాఠశాలల వివరాలు..	
ప్రాథమిక పాఠశాలలు:	35
ప్రాథమికోన్నత పాఠశాలలు:	01
ఉన్నత పాఠశాలలు:	08
విద్యార్థులు:	2,783

నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు

ఎస్‌ఎంసీ ఎన్నికలను ఉన్నతాధికారులు నిర్దేశించిన నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుంది. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అలసత్వం వహించకుండా సజావుగా, సకాలంలో ఎన్నికలను నిర్వహించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణకు హెచ్‌ఎంలకు సహకరించాలి. ఎస్‌ఎంసీ కమిటీల పాత్ర పాఠశాల నిర్వహణలో అత్యంత కీలకం.

జి.లీలారాణి, ఎంఈవో–2, ప్రత్తిపాడు

డిసెంబర్ తరువాతే కొత్త పింఛన్లు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



కలెక్టర్‌కు తన గోడును వెల్లబోసుకుంటున్న వృద్ధురాలు మల్లీశ్వరి

ప్రత్తిపాడు: కొత్త పింఛన్లు ఇప్పుడు రావని, డిసెంబర్ తరువాతనే కొత్త పింఛన్లు వస్తాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం కలెక్టర్ పర్యటిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన వృద్ధురాలు వి.మల్లీశ్వరి కలెక్టర్ వద్దకు వచ్చి చాలా రోజులుగా పింఛను కోసం తిరుగుతున్నానని, అనేక సార్లు దరఖాస్తు చేసుకున్నానని, కానీ నేటి వరకు పింఛను మంజూరు కాలేదని వాపోయారు. స్పందించిన కలెక్టర్ నాగలక్ష్మి మార్చి 31వ తేదీ నాటికి పింఛను కోసం దరఖాస్తు చేసుకుని ఉంటే, డిసెంబర్‌లో నూతన పింఛన్లతో పాటు వస్తుందన్నారు. పూర్తి వివరాలను ఎంపీడీవోకు ఇస్తే పరిశీలిస్తారన్నారు. అప్పటికే దరఖాస్తు చేసుకుని ఉన్నప్పటికీ, ఇప్పటికిప్పుడు రాదని, మూడు నాలుగు నెలల సమయం పడుతుందని తెలిపారు. వృద్ధురాలి వివరాలను సచివాలయంలో పరిశీలించాలని, అక్కడ లేకుంటే పీడీ ఆఫీసులో పరిశీలించాలన్నారు. అక్కడ ఉంటే కచ్చితంగా వస్తుందని, లేకుంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని, పింఛను వచ్చేందుకు టైం పడుతుందని కలెక్టర్ వృద్ధురాలికి వివరించారు.

అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం



గుంటూరు రూరల్: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చొడవరం గ్రామంలోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం (ఏక్ పేడ్ మా కే నామ్ సే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వారి వారి తల్లి పేర్లపై ఒక్కొక్క మొక్కను నాటారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ చెట్లు మనకు స్వచ్ఛమైన గాలి నీరు, ఆహారాన్ని అందిస్తాయన్నారు. మనం చెట్టును కాపాడితే ఆ చెట్టు మనలను కాపాడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ తల్లి పేరుపై చెట్టు నాటాలని ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహద పడతాయని, వాయు కాలుష్యాన్ని నియంత్రించి ఓజోన్ పరిరక్షణలో కీలక పాత్ర వహిస్తాయన్నారు. కళాశాల ఆవరణలో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ ఎం.సతీష్‌కుమార్, పీడీ పి.పున్నారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలి



విజ్ఞాన్ లారాలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య

విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

చేబ్రోలు: విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటేనే మంచి ప్రొఫైల్ డెవలప్ అవుతుందని వారిలో కమ్యూనికేషన్, టీమ్ స్పిరిట్ పెంపొందుతుందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు, అభివృద్ధి అనేది సంతోషంగా జరగాల్సిన ప్రక్రియని అన్నారు. విద్యార్థులకు నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. తల్లిదండ్రులందరూ పిల్లలను ప్రోత్సహించినట్లయితే వారు ఆరోగ్యంగా, మానసికంగా, సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం గతేడాది ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఐడియాథాన్, హ్యాకథాన్ కోడింగ్ కంటెస్ట్‌లలో అత్యధిక ప్రతిభ కనపరిచిన 26 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, ప్రిన్సిపల్ కె.ఫణీంద్రకుమార్, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులంటే అంత చులకనా..!?

ఆస్పత్రి సిబ్బందిపై మండిపడ్డ రోగులు



రోగులకు ఆస్పత్రి సిబ్బందికి మధ్య జరుగుతున్న వాగ్వాదం

ప్రత్తిపాడు: ఆస్పత్రికి వచ్చే ప్రజలన్నా, రోగులన్నా మీకు ఎందుకంత చులకన అంటూ ఆస్పత్రి సిబ్బందిపై రోగులు మండిపడ్డారు. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపీ నమోదు చేయించుకునే సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది దురుసుగా మాట్లాడుతున్నారు. బుధవారం మీర్జా అని వ్యక్తితో సిబ్బంది దురుసుగా మాట్లాడగా.. ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రి గడప తొక్కే రోగులు, మహిళల పట్ల లెక్క లేనితనంగా మాట్లాడటం ఏమిటని సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో సిబ్బందికి రోగులకు మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. పెద్ద పెద్దగా కేకలు వేసుకోవడంతో రెవెన్యూ అధికారులు కలుగజేసుకుని సర్ది చెప్పారు. అధికారుల ముందు కూడా ఆస్పత్రి సిబ్బంది అంతే దూకుడుగా మాట్లాడటంతో అధికారులు కాసేపు విస్తుపోయారు. అనంతరం సిబ్బంది తీరును మీర్జాతో పాటు పలువురు రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె రిసెప్షన్, ఓపీల వద్ద ప్రజలతో మంచిగా మాట్లాడేవారికి విధులను కేటాయించి, ప్రస్తుతమున్న సిబ్బందికి ఇతర డ్యూటీలు కేటాయించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ఒలీవా

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తుమ్మలపాలెం అప్పర్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఫ్లోరోసిస్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు ఫ్లోరోసిస్ ఎలా సంక్రమిస్తుంది? ఫ్లోరోసిస్ సోకడం వలన కలిగే అనర్థాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ ఒలీవా మాట్లాడుతూ ఫ్లోరోసిస్ బోరు నీటిని తాగడం వలన కూడా వ్యాపిస్తుందని చెప్పారు. పళ్లకు, కాళ్లకు కూడా వ్యాధి సోకుతుందని, అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు వై.శ్రీలత, ఆశా కార్యకర్తలు జ్యోతి సాధన, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గంటా మోహనరావుకు సన్మానం



మోహనరావును సన్మానించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: పురపాలిక సంఘ పరిధిలో గత 34 ఏళ్లుగా స్విచ్ మ్యాన్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన గంటా మోహనరావుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ నయీం అహ్మద్, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

– అనంతరం కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ్య, డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్లు, టిడ్కో గృహాలపై చర్చించారు. సమావేశంలో కమిషనర్ నయీం అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

హ్యాక్ ఫెస్ట్‌లో మెరిసిన చలపతి విద్యార్థులు



హ్యాక్ ఫెస్ట్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారి ఉన్నతికి తమ కళాశాల కృషి చేస్తుందని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల కళాశాల విద్యార్థులు, సాప్ సంస్థ, పీఎస్‌జీ కళాశాల సంయుక్తంగా తమిళనాడు కోయంబత్తూరులో నిర్వహించిన హ్యాక్ ఫెస్ట్ జాతీయ స్థాయిలో తమ కళాశాల విద్యార్థులు 11వ స్థానంలో నిలిచారన్నారు. పోటీలలో అన్ని రౌండ్లలో ఉత్తమ ప్రతిభను చూపి మొత్తం 100 టీంలలో తమ కళాశాల విద్యార్థులు 11వ స్థానంలో నిలవటం సంతోషకరమన్నారు. విద్యార్థులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. ఇటువంటి పోటీలలో పాల్గొనే విద్యార్థులకు తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉండి అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. 11వ స్థానంలో నిలిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ



ప్రత్తిపాడు: జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గనికపూడిలో బుధవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ డి.సాత్విక ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని అంతర్గత వీధుల్లో నినాదాలతో ర్యాలీ చేశారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గ్రామాల్లో ఇంటింటి సర్వే జరుగుతుందని, శరీరంపై రాగి రంగు మచ్చలు, పొడలు ఉంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కండరాల బలహీనత, నరాలు లావుగా, నొప్పిగా ఉన్నా సర్వే సమయంలో ఇంటికి వచ్చిన సిబ్బందికి వివరించాలన్నారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చని వివరించారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలికి డాక్టరేట్



ఎస్‌జేఆర్‌కే పద్మినివల్లి

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడి ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చొడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వసంతం శ్రీఝాన్సీరాఘవకోట పద్మినివల్లికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. యాన్ ఎఫిషియంట్ సెంటిమెంట్ బేస్డ్ ఎమోషన్ క్లాసిఫికేషన్ ఇన్ యాన్ స్ట్రక్చర్డ్ టెక్స్ట్‌వల్ డేటా యూజింగ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై కళాశాలకు చెందిన డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాలలో పీహెచ్‌డీ కలిగిన స్టాఫ్ 144 మంది ఉన్నారని చెప్పారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శ్రీలత తదితరులు అభినందించారు.

ప్రత్తిపాడు సీహెచ్‌సీ డీడీవోగా డాక్టర్ అఖిల్‌రత్నం



డాక్టర్ జి.అఖిల్‌రత్నం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో), ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌గా జనరల్ సర్జన్ డాక్టర్ జి.అఖిల్‌రత్నంను నియమిస్తూ హాస్పిటల్ సర్వీసెస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్య రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆస్పత్రి డీడీవోగా కొనసాగుతున్న చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సీహెచ్ నాగార్జునను రెండు రోజుల కిందట ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ నేపథ్యంలో నాగార్జున బుధవారం అఖిల్‌రత్నంకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అత్యుత్తమ సేవలు అందిచేందుకు తన వంతుగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా తన వంతుగా శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేస్తానని చెప్పారు.